క్లుప్తంగా

నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల తల్లి దండ్రులు, స్కూల్స్ పేరెంట్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం జిల్లాలో పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సోమవారం వినాయక చవితి పండగ నేపథ్యంలో శనివారం స్కూళ్లకు సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

గణపతి మట్టి విగ్రహాల పంపిణీ



గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శుక్రవారం వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాం సుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మట్టి విగ్రహాలను అందించినట్లు తెలిపారు.

డ్రైనేజీల నిర్మాణం ప్రారంభం



శంకుస్థాపనలో పాల్గొన్న శ్రీహరి తదితరులు

ప్రకాశం నగర్: ముఖ్యమంత్రి స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంట్ ద్వారా 42, 43, 44, 47 వార్డుల్లో రూ.85 లక్షలతో డ్రైనేజీలు నిర్మించనున్నారు. ఈ పనులను 47వ డివిజన్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంపీ భరత్ రామ్ ఆదేశాల మేరకు 47వ వార్డులో శేషగిరిమెట్ట, అంబేడ్కర్ నగర్, డ్రైనేజీ, రోడ్డు విస్తీర్ణ పనులను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. వార్డు ఇన్‌చార్జి సత్యవాణి, తిరగడ దుర్గారావు, అనంతలక్ష్మి, డొమ్మేటి రాజు, పాస్టర్ ప్రవీణ్, గుడాల ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



కడియం దేవీచౌక్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

కడియం: వ్యక్తిగత పరిశుభ్రతే సంపూర్ణ ఆరోగ్యానికి మూలమని కడియం హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూలు విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గ్రీన్‌కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం దేవీచౌక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఉపాధ్యాయులు సువర్ణవేణి, కర్రి రాజు, జి. శరత్‌బాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సూర్య ప్రతిభ

ప్రకాశం నగర్: యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్యాంకాక్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో అంతర్జాతీయ యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 19 విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థి తాడేపల్లి సూర్య ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు శుక్రవారం తెలిపారు. కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డీవీ రమణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ పాఠశాలలో శుక్రవారం పదో బ్యాచ్ ప్రారంభమైంది. 16 మంది లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి హెవీ డ్రైవింగ్ శిక్షణ కోసం, నలుగురు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, డ్రైవింగ్ నైపుణ్యత తెలుసుకునేందుకు ఈ పాఠశాలలో చేరారు. వీరికి శిక్షణ మెటీరియల్‌ను ఎంవీఐ సంపత్ కుమార్, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం అందజేశారు. వారికి డ్రైవింగ్ ప్రాథమిక సూత్రాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కడియం: శ్రావణ మాసం శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కడియపులంకలోని ముసలమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పంచమంగళ హారతుల కార్యక్రమం, ప్రసాద వితరణ దాతల సహకారంతో జరిగింది. కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం

- పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు
- బంకమట్టితో తయారయ్యే గణపతి ప్రతిమలే మేలు



ధవళేశ్వరంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గణనాథులు



మోరంపూడిలో మట్టితో తయారు చేసిన విగ్రహానికి తేలికపాటి రంగులు వేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: హిందువుల ముఖ్యమైన పండగల్లో వినాయక చవితి ఒకటి. వాడవాడలా గణపయ్యలను కొలువుతీర్చి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రతిమలను ఆకర్షణీయంగా, భారీ సైజుతో తయారు చేయడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే పీఓపీతో తయారు చేసిన విగ్రహాలు మట్టి విగ్రహాల్లా కరిగిపోకుండా పర్యావరణానికి అత్యంత ముప్పు తెచ్చి పెడుతున్నాయి. దీంతో పర్యావరణ ప్రేమికులు మట్టి గణపతి ప్రాధాన్యతపై ప్రజలకు తెలియజేస్తున్నారు. ఉచితంగా మట్టి గణపతులను అందిస్తూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టిమేలు తలపెడదామంటూ పిలుపునిస్తున్నారు. ఈక్రమంలోనే కొందరు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి గణపతులను తయారు చేయించి, ఉచితంగా అందించేందుకు జిల్లాలోని రాజమహేంద్రవరంతో పాటు పలు పట్టణాల్లో, గ్రామాల్లో సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

పీఓపీ విగ్రహాలతో అనర్థాలు

పీఓపీ విగ్రహాల్లో భారీ లోహాలు మెర్క్యురీ, క్రోమియం, లెడ్ అధికంగా ఉంటాయి. బంకమట్టితో చేసినవైతే నీటిలో త్వరగా కరిగిపోతాయి. ఆక్సిజన్ పరిమాణాన్ని తగ్గించే పీఓపీను వాడడం వల్ల తీవ్ర ముప్పు ఏర్పడుతోంది. తాగునీరు విషతుల్యంగా మారుతోంది. ఈ నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయి. నిమజ్జన సమయంలో జరిగే కాలుష్య హాని గురించి అందరూ తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమజ్జనం రోజు ప్రతిమలతో పాటు వేసే ఆకులు, పూలు, పాలిథిన్ బ్యాగులు, అద్దకాలు, రంగులు వంటివి కూడా నీటిని కాలుష్యంగా మారుస్తాయి. వీటి ప్రభావం జల జీవులు, వృక్షాలు, జంతువులపైనా అధికంగా ఉంటుంది. అందుకే పీఓపీతో తయారు చేసే వినాయక విగ్రహాల జోలికి వెళ్లవద్దని అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు.

గణనాథులు సిద్ధం

ధవళేశ్వరం: గణేష్ ఉత్సవాలకు భారీ గణనాథులు సిద్ధమయ్యారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ఈ విగ్రహాలను తీసుకువెళ్లేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు. ధవళేశ్వరం శివారు బాయ్స్ హైస్కూల్ వద్ద విగ్రహాలను తయారు చేస్తున్నారు. శివపార్వతులతో కూడిన వినాయక విగ్రహాలు, వివిధ ఆకృతులతో కూడిన వినాయకులను తయారు చేశారు. గణనాథుని విగ్రహాల తయారీని వినాయక చవితికి తొమ్మిది నెలల ముందు ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన 20 మంది కార్మికులు రాత్రీ పగలూ కష్టపడి సుమారు 400 విగ్రహాలను రూపొందించారు. వాటి అమ్మకాలను 15 రోజులుగా ప్రారంభించారు.

మట్టి విగ్రహాలకు డిమాండ్



ఏటా వినాయక చవితికి మూడు నెలల ముందు నుంచీ వినాయక విగ్రహాలు తయారు చేస్తాం. కుటుంబ సభ్యులందరం కలిసి చిన్న బొమ్మల దగ్గర నుంచి 14 అడుగుల విగ్రహాల వరకూ రూపొందిస్తాం. పీఓపీ విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటీవల మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. మట్టి విగ్రహాలు అందంగా కనిపించేలా నీటిలో కరిగిపోయే తేలికపాటి రంగులను వాడుతున్నాం. మట్టి విగ్రహాలు తయారు చేసినందుకు ఒక ఏడాది పర్యావరణ పరిరక్షణ అవార్డును నగరపాలకసంస్థ అందించింది. చాలామంది మట్టి గణపతుల ఆర్డర్లు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు.

– ఆర్.రాము, మట్టి విగ్రహాల తయారీ దారుడు, మోరంపూడి

ఆకర్షణీయంగా విగ్రహాలు



వినాయక విగ్రహాల తయారీని తొమ్మిది నెలల ముందు ప్రారంభించాం. ధవళేశ్వరం నుంచి సుమారు 200 కిలోమీటర్లు దూరం వరకూ వీటిని తీసుకువెళుతున్నారు. విజయవాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలకు కూడా రవాణా అవుతున్నాయి. పండగ సమీపిస్తుండటంతో కొనుగోలుదారుల కోసం వేచి చూస్తున్నాం. ఆకర్షణీయంగా ఉండే ఈ విగ్రహాలను అందుబాటు ధరలకే అందిస్తున్నాం.

– దినేష్ కుమార్, విగ్రహాల తయారీ దారుడు, ధవళేశ్వరం

మట్టి గణపతులను పూజిద్దాం



సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలతోనే ప్రజలు ఎకోఫ్రెండ్లీ వినాయక చవితి పండగ జరుపుకోవాలి. ఇళ్లల్లోని చిన్న ప్రతిమలను ఇంటి వద్ద బకెట్లలో నిమజ్జనం చేయాలి. అందంగా ఉన్నాయి కదా అని పీఓపీ విగ్రహాలు వాడి, నిమజ్జనం చేస్తే నీరు కలుషితమవుతుంది. కాలుష్య నివారణకు మట్టిగణపతి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని ప్రజలకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తరపున అవగాహన కల్పిస్తున్నాం. మట్టి గణపతులనే పూజిద్దాం.

– బి.సందీప్‌రెడ్డి, ఈఈ, ఏపీ కాలుష్య నివారణ మండలి, కాకినాడ

అవగాహన కల్పించాం



ఎంత పెద్ద విగ్రహం పెట్టి పూజిస్తే అంత గొప్ప అనుకోవడం మానేయాలి. సైజు కన్నా భక్తి ఎక్కువగా ఉంటే పర్యావరణంపై కూడా బాధ్యత ఉంటుంది. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులకు పీఓపీ విగ్రహాల వలన కలిగే అనర్థాలు తెలియజేశాం. మట్టి విగ్రహాలు వినియోగించడం మంచిదని అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లల్లో మాత్రం మట్టి విగ్రహాలను వినియోగిస్తున్నారు. మండపాలలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలే పెద్ద సమస్య. పీఓపీ విగ్రహాలపై మోజు వీడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– జీవీఎస్ శ్రీనివాస నెహ్రూ, జిల్లా సైన్స్ అధికారి

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్



దుళ్లలో సర్వేను ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు

సీటీఆర్ఐ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఆ కార్యక్రమ సర్వేను స్థానిక 1, 2, 9, 50 డివిజన్ల పరిధిలోని సచివాలయాల్లో శుక్రవారం ప్రారంభించారు. నారాయణపురం వాంబే గృహాల వద్ద కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్లు, హెల్త్ సెక్రటరీలు ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్షలో చేపట్టే పరీక్షల గురించి, అలాగే 30 నుంచి ప్రారంభమయ్యే ఆరోగ్య శిబిరాల గురించి తెలియజేయాలన్నారు. అనంతరం నారాయణపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

కడియం: దుళ్ల సచివాలయం 1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు ప్రారంభించారు. వైద్య సిబ్బంది, ఆశ, పంచాయతీ సిబ్బంది అవగాహనా ర్యాలీ చేపట్టారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది బి.వినీత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారన్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి, వారికి టోకెన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారికి ఈనెల 30వ తేదీన గ్రామాలో నిర్వహించే వైద్య శిబిరంలో పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కాలెపు చెల్లారావు, నామాల బాలసరోజిని, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, ఏఎన్ఎం ముత్యాలు పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పూర్తి ఆధారాలతోనే ఏపీ సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక వీఎల్ పురంలోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకూ అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు పాపం ఇన్నాళ్లకు పండిందన్నారు. అన్ని కేసుల్లోనూ స్టేలు తెచ్చుకుని విచారణ ముందుకు పోకుండా నిలుపుదల చేసుకుని కాలం గడిపిన ఆయనను, ఇప్పుడు అనేక కేసులు చుట్టుముడుతున్నాయన్నారు. ఇన్నాళ్లూ తెర వెనుక నడిచిన టీడీపీ, జనసేన చీకటి ఒప్పందం ఇప్పుడు బట్టబయలు అయ్యిందన్నారు. ఇందులో కొత్తేమీ లేదన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, కొప్పినీడి రాజమౌళి, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కాపుల ఓట్ల కోసమే..



గిరజాల వీర్రాజు

కడియం: కాపుల ఓట్ల కోసం చంద్రబాబు వాడుకుంటున్న పాచిక పవన్ కల్యాణ్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. గురువారం కడియంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాదరణ కోల్పోయిన తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి మాత్రమే జనసేన పార్టీ ఏర్పడిందన్నారు. కాపులను అన్నివిధాలా అణగదొక్కిన చంద్రబాబు, ఇప్పుడు కాపుల ఓట్ల కోసం పవన్ కల్యాణ్ అనే గేలాన్ని సిద్ధం చేశారన్నారు. పవన్ కల్యాణ్ కూడా తన ముసుగు తొలగించారన్నారు. ఒక పార్టీని గెలిపించడం కోసం మరో పార్టీని ఏర్పాటు చేసిన రికార్డు ప్రపంచంలోనే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. జనసైనికులు ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు.

కార్మికులకు వైద్యశిబిరం

ప్రకాశం నగర్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయ సేవల పథకం ద్వారా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత తెలిపారు. శుక్రవారం జాతీయ హరిత ట్రిబ్యునల్ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా పలు రీసైక్లింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆ ప్రదేశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రమాదకర పరిస్థితులలో పని చేస్తుంటారని, వారి సంక్షేమం కోసం ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కళ్లజోళ్లు అవసరం ఉన్నవారికి, వాటిని తయారు చేయించి అతి త్వరలో అందజేస్తామని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న పర్యవేక్షణలో రక్తపోటు, మధుమేహం వంటి సాధారణ పరీక్షలతో పాటు హాజరైన కార్మికులకు (వేస్ట్ పికర్స్) కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం యాప్రాన్లు, బూట్లు, మాస్కులు అందజేశారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



ధవళేశ్వరంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఇంజనీర్లు

ధవళేశ్వరం: స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీపీఎం ఎస్ఈ అరుణ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన మార్గంలో ఇంజనీర్లు పయనించాలన్నారు. కార్యక్రమంలో ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్ కాశీ విశ్వేశ్వరరావు, డీసీఈ శ్రీరామచంద్రరావు, ఈఈలు ఐవీ సత్యనారాయణ, సత్య శ్రీనివాస్, డీఈలు పాల్గొన్నారు. బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జి.కొండలరావు, ఒంటిద్దు స్వామి, కోనా సతీష్, గుజ్జుల సూరిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 38వ డివిజన్‌లో మాతృశ్రీ జూనియర్ కాలేజీ నుంచి ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవాలయం చైర్మన్, డివిజన్ ఇన్‌చార్జి అరిగెల బాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయన వారందరికీతో ఆప్యాయంగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి అనేక పథకాలు

- ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం
- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



కడియపులంకలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: కడియపులంక సచివాలయం 1లో శుక్రవారం రెండోరోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిథిగా రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే 98 శాతం హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి కూడా ఇచ్చేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, ఈలి గోపాలం, కొత్తపల్లి శివాజీ, అయితరెడ్డి అయ్యప్ప, బోడపాటి సత్యనారాయణ, తిరుమలశెట్టి వాసు, ముత్యం జగదీష్, మండెల బంగారయ్య, సింగంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీఎఫ్ ఉద్యోగుల టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సౌత్‌జోన్ వాలీబాల్, బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు శుక్రవారం కవలగొయ్యిలోని ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్ ప్రాంగణంలో జరిగాయి. విజేతలకు పీఎఫ్ రాజమహేంద్రవరం ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడ్డాయి. బాస్కెట్‌బాల్‌లో కేరళ విన్నర్‌గా, తమిళనాడు రన్నర్‌గా, వాలీబాల్ పోటీలో కర్ణాటక విన్నర్‌గా, తమిళనాడు రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు, డీన్ హర్షిణీ దేవి, వైస్ ప్రిన్సిపాల్ సైదా భాను, రీజనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు సభ్యుడు కె.మహేష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ దినోత్సవం



ఓ3 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ప్రకాశం నగర్: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు, జిల్లా సైన్స్ సమన్వయకర్త కె.సతీష్ బాబు పాల్గొన్నారు. పర్యావరణ హిత వస్తువుల వాడకం పెంచాలని, ఆ దిశగా విద్యార్థులు ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వ్యకృతం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఓ3 ఆకారంలో కూర్చున్నారు.

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ సమన్వయకర్త కె.సతీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన కబడ్డీ జట్టు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని జూబ్లీ మెమోరియల్ జూబ్లీ ఆర్‌సీఎం స్కూల్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గస్థాయి అండర్ 14, 17 బాలురు, బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు ముగిశాయి. కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలస్థాయి జట్లకు వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందు కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ స్వామి పోటీలను పర్యవేక్షించారు. రూరల్ నియోజకవర్గస్థాయిలో ఎంపికైన జట్లు జిల్లాస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటాయని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఇబ్రహీం తెలిపారు.

అదనపు జిల్లా జడ్జీలుగా పదోన్నతులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జీలను పదోన్నతిపై అదనపు జిల్లా జడ్జీలుగా బదిలీ చేస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్ బదిలీపై రాజమహేంద్రవరం ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు వెళ్లారు. ఆయన స్థానంలో తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు పదోన్నతిపై రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగవు

ప్రకాశం నగర్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుపై టీడీపీ, జనసేన పార్టీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి బి.రాజు అన్నారు. జాంపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుపై 8 అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన

కడియం: నాభూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శుక్రవారం కడియపులంకలో ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. కొటికలపూడి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగులపల్లి వీరబాబు, బొరుసు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీనివాస్, పాటంశెట్టి రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండానే కేసు

ప్రకాశం నగర్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు రాజ్యాంగ చట్టాలకు అగౌరవం తెచ్చే విధంగా ఉందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై ప్రాథమిక ఆధారాలు లేకుండానే కేసు నమోదు చేశారని ఆరోపించారు.

టీడీపీ నాయకుల దీక్ష

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బొమ్మూరులో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం కామిని ప్రసాద్, కామిని భాస్కర్, నిమ్మలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరహార దీక్షలు చేపట్టారు. అలాగే బొమ్మూరులోని బిలాల్ మసీదులో మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి శుక్రవారం నమాజులో పాల్గొన్నారు.